క్లుప్తంగా

నేడు గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పేర్లు నమోదు చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గర్భిణులకు సోమవారం పోషకాహార విలువలు కలిగిన న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రెండవ చెకప్ చేయించుకున్న, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఈ కిట్లను అందజేస్తున్నట్లు డాక్టర్ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేక ప్రమాదకరంగా మారింది. దీంతో మూగజీవాలు, చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చుట్టూ రక్షణ కంచే ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ధర్మసమాజ్ కరపత్రాల ఆవిష్కరణ

చిన్నంబావి: మండలంలో ధర్మ సమాజ్ పార్టీ పరిచయ కార్యక్రమ కరపత్రాలను మండల నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సబ్బండ కులాల స్వరాజ్యం ధర్మసమాజ్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, శివశంకర్, నరసింహ, అశోక్, బలరాం, రాంచందర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ


అంకిత


మహేశ్వరి


ఏ.పవన్‌నాయక్


సంతోష్‌నాయక్

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో పీ.అంకిత జాతీయస్థాయిలో 3,254, పీ. మహేశ్వరి జాతీయ స్థాయిలో 4,010 ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ ఆరోగ్యం పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ఎస్టీ గురులకు కళాశాలకు చెందిన విద్యార్థులు ఏ.పవన్‌నాయక్, సంతోష్‌నాయక్ జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. పవన్‌నాయక్ 141వ, సంతోష్‌నాయక్ 511వ ర్యాంక్ జాతీయ స్థాయిలో సాధించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ కె.తిరుపతయ్య ఆనందం వ్యక్తం చేశారు.

నీటి వృథాను అరికట్టండి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని రంగసముద్రం నీటి ఆయకట్టు కింద ఉన్నటువంటి తూములను తెరవడంతో కాల్వల ద్వారా నీరు వృథాగా కిందికి వెళ్తూ పంటపొలాలు తడుస్తున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రంగసముద్రం తూములను మూసి నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్

వనపర్తి టౌన్: పట్టాలిచ్చిన వారికి ఇళ్ల స్థలాలు చూపాలని, పట్టాలు లేని నిరుపేదలకు ఇంటి స్థలం, నిర్మాణానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం రూ.10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట, చెంచువాడ, బుడగజంగాల కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాయిలీల, బీసన్న, గోపాలకృష్ణ, ఆనంద్, కృష్ణయ్య, జగదీష్, నడిపన్న తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు

- పొలం పనుల్లో బిజీబిజీ
- తొలకరి ముందే ఏర్పాట్లు


మదనాపురం శివారులో పొలం దున్నుతున్న రైతు

మదనాపురం: జిల్లాలో రైతులు వానాకాలం పంట సాగుకు సిద్ధమవుతున్నారు. జూన్ నెల ప్రారంభం కావడంతో అక్కడక్కడ తొలకరి వర్షాలు ఇప్పటికే కురుస్తున్నాయి. ఈసారి సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు భావించి తమ పొలాలను సిద్ధం చేస్తున్నారు. పగలంతా తీవ్రమైన ఎండ కనిపిస్తున్న సాయంత్రం వేళల్లో వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో కూడిన వర్షం అక్కడక్కడ పడుతుండడంతో పొలం పనుల్లో బిజీ అయ్యారు. ఇప్పటికే జిల్లాలో పత్తి విత్తనాలు వేశారు. ఓ పక్క ఎండలు తీవ్రంగా ఉండడంతో రైతులు ముందుగానే విత్తనాలు వేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కానీ రైతులు తొలకరి దృష్టిలో ఉంచుకొని డ్రిప్ పద్ధతి ద్వారా విత్తనాలు వేసి నీటి తడులు అందిస్తే తర్వాత భారీ వర్షాలు వస్తే ఇబ్బంది ఉండదని రైతులు భావిస్తున్నారు.

ముందుగా విత్తుకుంటే లాభాలు

వానాకాలం ప్రారంభంలోనే విత్తనాలు విత్తుకుంటే పంటలు ఏపుగా పెరుగుతాయని రైతుల అంచనా. ఇప్పటికే ఎరువుల విత్తనాలను కొనుగోలు చేసి సాగు పనులు చేస్తున్నారు. నేలను చదును చేయడం, ఎరువులను తెచ్చుకోవడం వ్యవసాయ పరికరకాలు తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. వేసవి దుక్కులను పూర్తిచేసిన రైతులు పొలాల్లో చెత్తను తీసేయడం, సేంద్రియ ఎరువులను తరలించడం, గతం కంటే ఈసారి పొలం మంచిగా చేయాలన్న ఆలోచనలో నిమగ్నమయ్యారు.

వరికే ప్రాధాన్యం..

జిల్లాలో ప్రధానంగా వరి పంట పైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. జూరాల, రామన్‌పాడు, గోపాల్ దిన్నె, శంకర సముద్రం, సరళాసాగర్, గణపసముద్రం తదితర జలాశయాలు ఉండడంతో వరి పంటనే సాగుచేయనున్నారు. పత్తి, పెసర్లు, మినుములు, ఆముదము, కందులు, కొన్నిచోట్ల ఆయిల్ ఫాంపై రైతులు శ్రద్ధ చూపుతున్నారు.

జిల్లాలో పంటల వారీగా వివరాలు (ఎకరాల్లో)

వరి	1.85లక్షలు
జొన్న	2,800
మొక్కజొన్న	12,500
కంది	15వేలు
పెసర	100
ఆముదం	2,500
మినుములు	500
పత్తి	22వేలు

సరైన తేమలో విత్తుకోవాలి



వానాకాలం సీజన్‌లో విత్తనాలు సరైన తేమలోనే విత్తుకుంటే మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకటి, రెండు వర్షాలు కురిసిన తర్వాత రైతులు పంటలను సాగు చేపట్టాలి. తొలకరి వర్షాలకు తొందర పడితే నష్టపోయే ప్రమాదం ఉంది. నీటి వసతి ఉన్న రైతులే అక్కడక్కడ విత్తనాలు వేస్తున్నారు. విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురు చూడొద్దు. విత్తనం వేసిన నాలుగు, ఐదు రోజుల తర్వాత వర్షాలు కురవకపోతే నష్టపోతారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– సుధాకర్‌రెడ్డి,
జిల్లా వ్యవసాయ అధికారి, వనపర్తి

ప్రయాణం.. నరకప్రాయం


దెబ్బతిన్న మేడేపల్లి రహదారి

- పూర్తిగా ధ్వంసమైన మేడేపల్లి రహదారి
- పదేళ్లుగా ప్రయాణికుల పాట్లు


కంకరతేలిన రోడ్డు

ఆత్మకూర్: ఏళ్లు గడుస్తున్న పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని మేడేపల్లికి వెళ్లేందుకు స్టేజి నుంచి 2కిలో మీటర్లమేర బీటీ రోడ్డును వేశారు. 2004లో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై, గుంతలమయంగా మారింది. మరమ్మతు చేయాలని, లేకుంటే కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైన స్పందించి చర్యలు తీసుకోవాలని మేడేపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

‘ఉపా’ కేసులను ఎత్తివేయాలి

అమరచింత: ప్రొ.హరగోపాల్‌తో పాటు మరో 150 మంది మేధావులు, ప్రజా సంఘాలు, పౌరహక్కుల కార్యకర్తలపై ప్రభుత్వం పెట్టిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయ్యలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ డిమండ్ చేశారు. రాష్ట్ర సాధనలో చురుకుగా పాల్గొన్న మేధావులపై ప్రభుత్వ వివక్ష చూపడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఎలాంటి సాక్ష్యం లేకుండా వ్యక్తి యొక్క పబ్లిక్ రికార్డు, ప్రవర్తన, హోదాతో సంబంధం లేకుండా ఒక వ్యక్తి, కొందరి వల్ల రాష్ట్రానికి ముప్పు అని పోలీసుల ద్వారా ప్రభుత్వం ప్రకటించడం తగదన్నారు. కేసులను ఉపసంహరించుకోకుంటే ఆందోళనలు చేపడతామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పాన్‌గల్: మండలంలోని చింతకుంటకు చెందిన భాగ్యకు మంజూరైన రూ.15 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును నియోజకవర్గకేంద్రంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ సాయంతో పేద కుటుంబాలు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటయ్య, పరశురాం, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


సమావేశమైన నాయకులు

పాన్‌గల్: ప్రభుత్వం అవలంభిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు కొనసాగించాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేస్తూ నియోజకవర్గంలో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీ కులవృత్తులకు రూ.లక్ష చేయూత వంటి పథకాలను తీసుకవచ్చిందనే ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు పర్యటిస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప, గడపకు వివరించాలన్నారు. సమావేశంలో రోజారమణి, అన్వేష్, నాగరాజు, జగన్‌గుప్తా, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పుష్కలంగా తాగునీరు


మేడేపల్లిలో వాటర్‌ట్యాంక్ వద్ద పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూర్: ప్రతి గ్రామంలో తాగునీరు పుష్కలంగా సరఫరా అవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు శివరంజని తెలిపారు. ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో నీటి పండుగ సంబరాలను నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేపట్టారు. గ్రామసభలో అభివృద్ధి పనుల ప్రగతి నివేదికను వివరించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్‌మన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుంపుగట్టు తాగునీటి పథకం పరిశీలన

మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు కొత్తకోట గుంపుగట్టు తాగునీటి పథకాన్ని ఆదివారం పరిశీలించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి జెండా ఊపి వాహన ర్యాలీ ప్రారంభించారు. జిల్లాకేంద్రంలో సంబరాలకు తరలివెళ్లారు.

పాన్‌గల్: మండలంలో మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకులను అలంకరించి, ర్యాలీలు నిర్వహించారు.

వీపనగండ్ల: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మండల కేంద్రం నుంచి పలువురు నాయకులు, యువకులు కానాయిపల్లికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఏఈ ఉదయ్‌కుమార్, గ్రామప్రజలు పాల్గొన్నారు.


పాన్‌గల్ మండలం అన్నారంలో..

అమరచింత: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లు, పంప్‌హౌజ్‌ల వద్ద మంచినీళ్ల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు మిషన్ భగీరథ ఏఈ సులోచన తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుందని పేర్కొన్నారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కమిషనర్ మహమ్మద్ ఖాజా పాల్గొన్నారు.


వీపనగండ్ల నుంచి నీటి పండుగకు బయలుదేరుతున్న యువకులు


నందిమళ్లలో..


ఖిల్లాఘనపురం మండలం రుక్కన్నపల్లిలో..

రుణమాఫీ హామీని విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జబ్బార్

వీపనగండ్ల: రైతులకు ఏకకాలంలో రూ.లక్ష రుణాన్ని మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మరిచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం కొందరి రైతుల ఖాతాలో డబ్బులను జమ చేయలేదన్నారు. రాష్ట్రంలో అర్హులైనవారికి రేషన్‌కార్డులు, పింఛన్లు, గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు, పేదప్రజల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. ధరణిపోర్టల్‌లో ఉన్న లోపాలను సవరించి నిజమైన రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాలను అందించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండ్ల కృష్ణయ్య, మహబూబ్‌పాషా, సర్పంచ్ మౌలాలి, ఈశ్వర్, ఆశన్న, శాంతమ్మ, నిరంజన్, బాలగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం


మాట్లాడుతున్న బంగారు శ్రుతి

వనపర్తిటౌన్: పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతస్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా అసెంబ్లీ సంయుక్త మోర్చాల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ హయాంలో నిరుపేదల నుంచి అగ్రవర్ణంలోని పేదల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాల ప్రయోజనం అన్నివర్గాలకు మేలు కలుగుతుందన్నారు. వీటిపై మే 30 నుంచి జూన్ 30వరకు ప్రచారం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పేదల ఆత్మగౌరవానికి సంబంధించి 2014 వరకు 39శాతంగా ఉన్న మరుగుదొడ్లను స్వచ్ఛ మిషన్‌లో భాగంగా 100శాతానికి చేర్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. పేదలకు ఆరోగ్య బీమా భద్రత కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్‌తో ఇప్పటి వరకు 10 కోట్ల మంది ప్రయోజనం పొందారని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో రాష్ట్రంలో 2.96 లక్షల మంది ఇళ్లు నిర్మించుకున్నారని, పేదలకు వంటింటి కష్టాలు తీర్చేందుకు తెలంగాణలో 11లక్షల పైచిలుకు ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు అందించారని చెప్పారు. రూ. 2,500 యూరియా బస్తాకు కేంద్రం రూ. 2,300 సబ్సిడీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ప్రతాప్, కృష్ణ, సబిరెడ్డివెంకటరెడ్డి, కృష్ణయ్య, శ్రీశైలం, నారాయణ, బుడ్డన్న, కుమార్, కల్పన, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు


అమరచింతలో పూజలు చేస్తున్న భక్తులు


పాతపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..

అమరచింత: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, శివచౌడేశ్వరి ఆలయాల్లో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లోని దేవేంద్రచార్యుల మఠంలో అమవాస్య పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు నిర్వహించినట్లు మఠం నిర్వాహకుడు నరసింహచారి తెలిపారు. చంద్రగడ్‌కోటపై శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేపట్టారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని ఆలయాల్లో అమావ్యాస పూజలు చేశారు. పట్టణంలోని మిట్ట, చింత ఆంజనేయస్వామి, పాతపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం దగ్గర ఆదివారం కమ్మరి గోపి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బస్టాండ్‌లో వసతులు కరువు


అమరచింత బస్టాండ్‌లో మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

అమరచింత: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. బస్సుల రాకపోకల సమాచారం కూడా నోటీసు బోర్డుపై లేకపోవడం, సమాచారాన్ని అందించే సిబ్బందిని నియమించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం నిరుపయోగంగా బస్సులు రాకుండా నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్‌ను అన్నివిధాల అభివృద్ధి పరుస్తామంటూ ఆర్టీసీ అధికారులు ముందుకు రావడం, గద్వాల డిపో బస్సులను మాత్రమే బస్టాండ్ వరకు కొనసాగించడంతో పాటు మరికల్, మహబూబ్‌నగర్‌లకు వెళ్లే నారాయణపేట డిపో బస్సులు కూడా బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా చేశారు. దీంతో ప్రయాణికులు కొత్త బస్టాండ్‌కు వెళ్లి బస్సులో ప్రయాణం చేయడానికి అలవాటు పడ్డారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రాంగణంలో మరుగుదొడ్లు, మూత్రశాలలను మాత్రం మరిచారు. శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను మరమ్మతు చేయకుండా వదిలిపెట్టడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవచూపి యుద్ధ ప్రాతిపదికన మరుగుదొడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

కాలం మారినా.. తగ్గని ఎండలు


నిర్మానుష్యంగా మారిన గాంధీచౌక్ ప్రాంతం

ఆత్మకూర్: కాలం మారినా.. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మండుతున్న ఎండలతో.. వడగాలులతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వడదెబ్బ తగిలి పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ ఎండదెబ్బకు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 6గంటల తర్వాతనే జనం ఇళ్లలో నుంచి బయటకు వస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు తీవ్రస్థాయిలో ఉండడంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అవసరముంటే తప్పా బయటకు రాకూడదని ప్రభుత్వాసుపత్రి వైద్యులు శబరి, నిస్సార్‌అహ్మద్ సూచించారు. కాగా వడగాలులకు పలువురు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం సంత కావడంతో ఎండల కారణంగా సాయంత్రం 6గంటల నుంచి వ్యాపారాలు కొనసాగాయి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండంలోని బలిజపల్లి–జంగమాయపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మద్దిలేటి, రాములు, కర్ణశ్రీలను సన్మానించారు.